జరిగిన కథ:

ప్రస్తుత కథలో ఆ రోజు రాత్రి రెండు గంటల వరకు సమయం తెలియకుండా అభిరామ్ మధుర మాట్లాడుతూ ఉండిపోతారు. అభిరామ్ కు ఉన్న మానసిక సమస్యకు పరిష్కారం సూచించడానికి మధుర ప్రయత్నం చేస్తుంది. ఎవరూ తనను అర్థం చేసుకోవడంలేదనే అభిప్రాయంతో అభిరామ్ అందరినీ దూరం పెట్టి తన చుట్టూ తానే గిరి గీసుకుని కూర్చున్నాడని ఆమెకు అర్థం అవుతుంది. అభిరామ్ ఆరోజు నుండి తన జీవితాన్ని మధుర చేతిలో పెడుతున్నాను అని చెప్తాడు.

గత కాలపు కథలో అంబాపురం ఆలయంలో సౌదామిని చేతికున్న ఉంగరాన్ని చూస్తాడు గుణ. వెనక్కి ఇంటికి చేరుకున్నాక మాలతిని నేరుగా ప్రశ్నించలేకపోతాడు. అంతకు ముందు నెల మాలతి పుట్టినరోజున, భద్ర సౌదామినిని వేరే ఊరిలో చూసినట్లుగా గుణతో చెప్తాడు. ఆరోజు గుణ రోజంతా మాలతితోనే ఉన్నాడు. కనుక మాలతియే సౌదామిని అవునా కాదా అన్న విషయం అర్థం కాక గుణ అయోమయంలో పడతాడు.

ఒకరికొకరు

మర్నాడు ఉదయం బయట ఏదో అలికిడయ్యి తెలివి వచ్చింది మధురకు. వాచీ చూస్తే 8 గంటలయ్యింది. రాత్రి తన గదిలోకి వచ్చేసరికి వచ్చి పడుకునేసరికి 2 గంటలు దాటింది. ఉదయమే మెలకువ రాలేదు. ఆమె వెంటనే గబగబా ముఖం కడుక్కొని కిందకు వెళ్ళింది. సత్యనారాయణ డైనింగ్ టేబుల్ వద్ద కూర్చుని కాఫీ తాగుతూ పేపర్ చదువుతున్నాడు.

"గుడ్ మార్నింగ్ మధురా! రాత్రి బాగా నిద్ర పట్టిందా? మా బడుద్ధాయ్ ఇంకా లేచినట్టు లేడు. రోజూ ఇంతే. నేను వెళ్లి లేపాలి. రాత్రంతా ఏవో బొమ్మలేసుకుంటూనో పుస్తకాలు చదువుతూనో కూర్చుని లేటుగా పడుకుంటాడు. బారెడు పొద్దెక్కినా లేవడు." అన్నాడు సత్యనారాయణ యధాలాపంగా.

"లేదు అంకుల్! రాత్రి 2 గంటల వరకు ఇద్దరూ మాట్లాడుకుంటూ కూర్చున్నాము. అస్సలు టైమ్ తెలియలేదు. ఆలస్యంగా పడుకున్నాడు." అంది మధుర టేబుల్ దగ్గర కూర్చుంటూ.

లక్ష్మి ఆమెకి కూడా కాఫీ తెచ్చి ఇచ్చింది. నెమ్మదిగా సత్యనారాయణతో మాట కలిపింది మధుర.

"అంకుల్! అభి తన ఇష్టాయిష్టాల గురించి ఎప్పుడైనా మీతో చెప్పే ప్రయత్నం చేసేవాడా?" అని అడిగింది.

"లేదమ్మా! వాడు చిన్నప్పటినుంచి మితభాషి. ఎక్కువగా మాట్లాడడు. వాడికి ఏం కావాలన్నా నేను తెలుసుకుని ఇవ్వాలి తప్ప తనకి ఇది కావాలని ఎప్పుడూ అడిగేవాడు కాదు. వాడికి 5 ఏళ్ల వయసు ఉండగా వాళ్ళ అమ్మ పోయింది. ఆ

తర్వాత వాడు చాలా డల్ అయిపోయాడు. స్కూల్లో కాలేజీలో కూడా ఎక్కువగా ఎవరితోనూ కలిసేవాడు కాదు. చిన్నప్పటినుండి పుస్తకాలు చదవడం, డ్రాయింగ్, పెయింటింగ్, ఫోటోగ్రఫీ అంటే వాడికి ఇష్టం. అవన్నీ సరదాల కిందకి, హాబీలు కిందకి వస్తాయి కానీ కడుపు నింపే వృత్తులు కావు కదమ్మా! ఎప్పటికైనా వాడు నా వ్యాపారం చూసుకోవాలి కనుక ఎంబీఏ చేయమంటే సరేనన్నాడు. అమెరికా పంపించి చదివించాను. కాస్త అక్కడ కల్చర్ కూడా ఫాస్ట్ గా ఉంటుంది కాబట్టి కొత్త మనుషులతో కలుస్తాడని అనుకున్నాను. కానీ అక్కడినుండి వచ్చాక ఎందుకో ఇంకా డల్ అయిపోయాడు. ఎక్కువసేపు ఒంటరిగా తన రూములో ఉండడం మొదలుపెట్టాడు. అనుకోకుండా అప్పుడే నా పార్ట్నర్ సినిమా తీస్తూ ఉండడంతో అందులో వీడిని హీరోగా పెట్టించాను. ఆ తర్వాత కాస్త సినిమాలలో బిజీ అయ్యి సర్దుకున్నాడు. కానీ ఇంకా పూర్తిగా అందరి అబ్బాయిల్లాగా లేడు. పెళ్లి మాట ఎత్తితే చాలు దాటేస్తాడు. వీడి భవిష్యత్తు విషయంలో నాకు చాలా బెంగగా ఉంది.'' అంటూ సత్యనారాయణ తన మనసులోని వేదన అంతా ఏకరువు పెట్టాడు.

మధుర నెమ్మదిగా గొంతు సవరించుకుని ''అభిరామ్ ను కొన్నాళ్ళు పెళ్లికి తొందర పెట్టకండి అంకుల్! మీ బాధ నాకు అర్థం అవుతోంది. కానీ నిన్న రాత్రి అభి నాతో తన పర్సనల్ విషయాలు చాలా పంచుకున్నాడు. దాన్ని బట్టి నాకు అర్థం అయినది ఏంటంటే తనకు అమ్మాయిల పట్ల, పెళ్లి పట్ల సరైన ఒపీనియన్ లేదు. యాక్టింగ్ విషయంలో కూడా తనకు ఇంట్రెస్ట్ లేదు. వేరే చేయడానికి ఏమీ లేక యాక్టింగ్ చేస్తున్నాడంతే. తనలో అన్ని విషయాలలోనూ చక్కని టాలెంట్ ఉంది. రేపు మీ బిజినెస్ చూసుకోవడం విషయంలో తనపై నాకు ఎలాంటి అనుమానమూ లేదు. మీరంటే తనకు ఎంతో ఇష్టం, గౌరవం. అందుకే మీ సంతోషం కోసమే సినిమాలలో యాక్ట్ చేయడానికి ఒప్పుకున్నాడు. మిమ్మల్ని సర్ప్రైజ్ చేయాలనే మంచి ఉద్దేశంతోనే శంషాబాద్లో తన సంపాదనతో విల్లా కొన్నాడు. మీ మనసు కష్టపెట్టకూడదని చాలా విషయాలు మీకు చెప్పకుండా దాస్తున్నాడు. మిమ్మల్ని బాధ పెట్టడం ఇష్టం లేక తనకు నచ్చకపోయినా మీరేం చెప్తే అది చేస్తున్నాడు. తండ్రిగా మీరు ఎప్పుడూ తన మంచి గురించే ఆలోచిస్తారు. తను బాగుండాలనే అనుకుంటారు. కానీ ఎందుకో తనకు నచ్చినట్లు తన లైఫ్ ఎంజాయ్ చేయలేకపోతున్నాను అనే వెలితి అభి మనసులో స్పష్టంగా తెలుస్తోంది నాకు.'' అంది మధుర సత్యనారాయణకు వివరిస్తూ.

''వాడేదైనా నాతో చెప్తే కదమ్మా నాకు తెలిసేది! వాడెప్పుడు ఏం అడిగినా నేను కాదనలేదు. సరే! తనకు ఎలా కావాలంటే అలాగే చేయమను. నేను దేనికీ అడ్డు చెప్పను. వాడి సంతోషమే నా సంతోషం. వాడు నీతో కాస్త మనసువిప్పి మాట్లాడుతున్నాడు అంటే నాకు ఆనందంగా ఉంది. ఎందుకో నీ పట్ల వాడికి నమ్మకం కుదిరింది. ఈ క్షణం నుండి వాడిని నీ చేతిలో పెడుతున్నాను తల్లీ! ఇకపై నువ్వే చూసుకో!'' అన్నాడు సత్యనారాయణ మధుర వైపు అభిమానంగా చూస్తూ.

ఆ మాట వినగానే ఆమెకు ఏమనాలో అర్థం కాలేదు. ఇంతలో అభిరామ్ కూడా కిందకు వచ్చి ఇద్దరినీ పలకరించాడు. ముగ్గురూ కలిసి కాసేపు మాట్లాడుకుని టిఫిన్ తిన్నారు. తర్వాత సత్యనారాయణ మధురను తన గదిలోకి

రమ్మని తీసుకువెళ్లాడు. అక్కడ అలమారలో కిందవైపు వారగా ఒక బ్యాగ్ ఉంది. అది తీసి ఆమె చేతికి ఇచ్చాడు. అందులో నాలుగు చూడీదారులు నాలుగైదు చీరలు ఉన్నాయి.

వాటివంక ఆశ్చర్యంగా చూస్తున్న మధురతో "అవి అభిరామ్ వాళ్ళ అమ్మ బట్టలమ్మా! జ్ఞాపకంగా దాచుకున్నవి. నీకు నచ్చినది తీసుకుని వేసుకో." అన్నాడు సత్యనారాయణ.

మధుర అలాగేనని చెప్పి అందులోనుండి ఒక డ్రెస్ తీసుకుంది. తన గదికి వెళ్లి స్నానం చేసి ఆ డ్రెస్ వేసుకుంది. మరల కిందకు వచ్చి వారి ఇంట్లో పూజ గదిలోకి వెళ్లి భక్తితో దీపం వెలిగించింది. ఆమెని చూస్తుంటే సత్యనారాయణ కళ్ళు చెమ్మగిల్లాయి.

తర్వాత మధుర అభిరామ్ వద్దకు వెళ్లి "ఈ డ్రెస్ ఎలా ఉంది? అంకుల్ ఇచ్చారు." అంది ఉత్సాహంగా. ఆమె పసిమి ఛాయకు మరింత అందాన్నిస్తోంది ఆ నెమలికంఠం రంగు డ్రెస్.

"మా అమ్మది కదూ! చిన్నప్పుడు మా అమ్మతో గడిపిన జ్ఞాపకాలేవీ పెద్దగా గుర్తు లేవు. బాగా చిన్నవాడిని కదా! అమ్మను ఫోటోలలో వీడియోలలో చూసినదే గుర్తు. ఇవాళ నిన్ను ఇలా చూస్తే మళ్ళీ మా అమ్మను చూసినట్లుంది. థాంక్యూ మధురా!" అన్నాడు అభిరామ్ ఆమెవంక తృప్తిగా చూస్తూ.

ప్రతి వారాంతంలోనూ మధురకు ఆ ఇంటికి వెళ్లిరావడం పరిపాటి అయిపోయింది. అభిరామ్ కూడా వారాంతాలలో ఎక్కువ సమయం ఇంట్లో మధురతోనూ సత్యనారాయణతోను గడిపేవాడు. మధుర అభిరామ్ ఇద్దరూ గంటల తరబడి కూర్చుని మాట్లాడుకునేవారు. పనివాళ్ళతో సహా ఆ ఇంట్లో అందరూ మధురను ఆ ఇంటి మనిషి కింద చూసుకోవడం మొదలుపెట్టారు. ఆమెకు కూడా అసలు ఆ ఇంట్లో ఏ విధంగానూ కొత్త అనిపించేది కాదు. చాలా చనువుగా వారిద్దరితో కష్ట సుఖాలన్నీ మాట్లాడేది. వాళ్ళ వంటింట్లోకి వెళ్లి తనకు నచ్చిన గోదావరి వంటలు చేసి వారికి పెట్టేది. పువ్వులు కోసి దేముడి గదిలో పటాలకు అలంకరించేది. ఆ ఇంట్లో తనకంటూ వేరే ఒక గది కూడా పూర్తిగా అప్పగించేశారు. కనుక అప్పుడప్పుడు రాత్రుళ్ళు అయితే అక్కడే ఉండిపోవడం అలవాటైపోయింది అమెకు. మరోక నెల రోజులు గడిచాయి.

ఒకసారి కాలేజీకి వినాయక నవరాత్రుల సందర్భంగా నాలుగు రోజులు వరుసగా సెలవులు వచ్చాయి. మధురకు తన తల్లిదండ్రులను చూడాలనిపించి ఊరికి వెళ్ళింది. ఉమాశంకరం, అపర్ణ కూతురుని చూసి సుమారు మూడు నెలలు కావడంతో ఆమెను ఎంతో ఆప్యాయంగా స్వాగతించారు. అపర్ణ మధురకు ఇష్టమైనవన్నీ చేసి పెట్టింది. ఒకనాటి మధ్యాహ్నం భోజనాలయ్యాక ముగ్గురూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. మధుర తన చదువు గురించి, కాలేజీ విషయాలను గురించి అన్నీ వారికి పూసగుచ్చినట్లు చెప్తోంది. మాటలలో తనకు అభిరామ్ తో ఏర్పడిన అనుబంధం

గురించి వారితో ప్రస్తావించింది. జరిగిన కథంతా మొదటినుండి చెప్పుకొచ్చింది. తల్లిదండ్రులు ఇద్దరూ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు.

"అంత గొప్పవాళ్ళతో మనకు స్నేహాలు ఎందుకమ్మా! అలాంటివాళ్లు ఎప్పుడు ఎవరిని చేరదీస్తారో ఎప్పుడు దూరం పెడతారో ఎవరూ ఊహించలేరు. మనవి చాలా చిన్న బతుకులు తల్లీ!" అన్నాడు తండ్రి ఉమాశంకరం కాస్త కలతపడుతూ.

"లేదు నాన్నా! అభిరామ్ తండ్రిని చూస్తే నీలాగే అనిపిస్తుంది. ప్రస్తుతం సంఘంలో పెద్ద పేరున్నవారే అయినా, మధ్య తరగతి కుటుంబం నుంచి కష్టపడి పైకి ఎదిగినవాళ్ళు. జీవితంలో కష్టసుఖాలు బాగా తెలుసు. నన్ను వారి ఇంటి బిడ్డలాగే చూసుకుంటున్నారు." అంది మధుర తండ్రిని సమాధానపరుస్తూ.

"ఏదేమైనా సినిమావాళ్ళతో చాలా జాగ్రత్తగా ఉండాలమ్మా! ఆ ప్రపంచం మనకు నప్పదు. వాళ్ళందరూ సమాజంలో చాలా పెద్ద స్థాయిలో ఉన్నవాళ్లు. వాళ్ల అలవాట్లు, జీవన విధానం చాలా వేరుగా ఉంటాయి. నువ్వు అసలే చాలా అమాయకురాలివి. అందరినీ సులువుగా నమ్మేస్తావు." వాపోయింది తల్లి అపర్ణ.

"అమ్మా! అభిరామ్ నువ్వు అనుకునేలాంటివాడు కాదు. నువ్వు ఒక్కసారి అతనిని కలిస్తే ఇలా మాట్లాడవు. ఈ విషయాలు ఫోన్లో చెప్తే మీరు అనవసరంగా కంగారుపడి ఏదేదో ఊహించుకుంటారని భయపడే నేను ఇన్నాళ్లుగా చెప్పలేదు. అలాగని మీ నుంచి ఏదీ దాచే ఉద్దేశం నాకు లేదు. సత్యనారాయణ గారు మిమ్మల్ని తనకు పరిచయం చేయమని అడిగారు. వచ్చేనెల విజయదశమి పండుగకి మీ ఇద్దరినీ హైదరాబాద్ వాళ్ళ ఇంటికి ఇన్వైట్ చేయాలని అనుకుంటున్నారు. మీరు ఒకసారి వచ్చి మాట్లాడితే మీ అనుమానాలు అన్నీ తీరిపోతాయి." అంది మధుర అనునయంగా.

"ఆ అబ్బాయి నిన్ను ఇష్టపడుతున్నాడా తల్లీ? నీకు కూడా ఆ అబ్బాయి అంటే ఇష్టమా?" ఈసారి నేరుగా అడిగింది అపర్ణ.

"నాకు తెలియదమ్మా! తను ఎప్పుడూ నా దగ్గర అటువంటి అభిప్రాయాన్ని బయట పెట్టలేదు. మంచి ఫ్రెండ్ లాగే బిహేవ్ చెస్తాడు. నాకు నేనుగా ఆ కుటుంబాన్ని కలవాలి అనుకోలేదు. చాలా వింత పరిస్థితులలో భగవంతుడే దగ్గర చేశాడు. ఎందుకో అభిరామ్ ఎప్పటినుండో తెలిసిన మనిషిలాగా అనిపిస్తాడు. దేవుడు మమ్మల్ని ఎందుకు కలిపాడో, ఏం నిర్ణయించాడో నాకు తెలియదు." అంది మధుర తడుముకోకుండా.

"సరేనమ్మా! ఏదేమైనా నువ్వు ఆశలు పెంచుకొని అనవసరంగా రేపు బాధపడకూడదు అన్నదొక్కటే మా భయం. జాగ్రత్తగా ఉండు తల్లీ! వాళ్లు పిలిస్తే అలాగే వచ్చేనెల దసరాకు హైదరాబాదు వస్తాము." అన్నాడు తండ్రి కూతురి తలమీద చేయి వేసి.

సందిగ్ధం

"ఏమైంది గుణా! పిలుస్తూ ఉంటే అలా పలకకుండా వెళ్ళిపోయావేమిటి? ఎక్కడికి అంతా హడావుడిగా వెళ్లావు? ఎందుకు అలా మొహం వేలాడేసుకుని ఉన్నావు? ఒంట్లో నలతగా ఉందా?" ఆదుర్దాగా అడిగింది సుందరమ్మ అప్పుడే ఇంటికొచ్చిన కొడుకు వాలకం చూసి.

"మరేం లేదులే పిన్నీ! నువ్వు కంగారుపడకు. పెళ్లికి వెళ్లి వచ్చాడుగా! అందరి కళ్ళు మన వాడి మీదే పడి ఉంటాయి. నువ్వు ముందు కాస్త వాడికి దిష్టి తీసేయ్ చెప్తాను." అన్నాడు భద్ర సుందరమ్మకు సర్ది చెప్తూ.

"అవునురా అదీ నిజమే! ఎన్ని కళ్ళు పడ్డాయో!" అనుకుంటూనే సుందరమ్మ లోపలికి వెళ్లి ఉప్పు మిరపకాయలు తీసుకువచ్చి గుణకు పూర్తిగా దిష్టి తీసి వాటిని బయట ఉన్న కర్రల పొయ్యిలో పడేసింది. వేడి నీళ్లు కాగబెట్టి గుణను స్నానం చేయమంది. అన్యమనస్కంగానే గుణ స్నానం చేసి కాస్త అన్నం తిని పడుకున్నాడు. కానీ ఏవేవో ఆలోచనలు అతనిని తరుముతున్నాయి. భద్రకు తన మనసులోని అనుమానాలు ఏవి పూర్తిగా చెప్పలేదు. తల్లికి కానీ వీరబాహుడికి కానీ చెప్తే వాళ్ళు కంగారుపడతారు. మాలతిని నేరుగా విషయం అడిగే ధైర్యం తనకు లేదు. కనుక కొన్నాళ్ళు మౌనంగా ఉంటూనే ఆమె వెన్నంటి ఉంటూ ఆమె దినచర్యను గమనించాలి అని నిశ్చయించుకున్నాడు గుణ.

"నమస్కారం మహాప్రభూ!" ఏక కంఠంతో పలుకుతూ శూరసేన మహారాజుకు శిరసువంచి నమస్కరించారు అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి.

"రాజ్యంలో పరిస్థితులు ఏమైనా మెరుగుపడ్డాయా? విషయాలు ఏమన్నా తెలిశాయా?" ఆతృతగా అడిగాడు శూరసేనుడు.

రాజు అంతరంగిక మందిరంలో అర్ధరాత్రి సమయంలో, అతనితో పాటు వేగులు చెప్పే వార్తలు రాజగురువు ఆనంద వర్ధనుడు, మంత్రి ప్రచండుడు కూడా ఆసక్తిగా వింటున్నారు.

"ప్రభూ! అంబాపురం గ్రామదేవికి నాలుగు రోజుల క్రితం ఏకాదశినాడు తృటిలో పెద్ద అపచారం తప్పింది. కానీ కాస్త రక్తపాతం జరిగింది. భక్తులెవరికీ ఏ విధమైన గాయాలు అవలేదు. సౌదామిని వీరోచితంగా పోరాడి దుండగులను తుదముట్టించింది." అన్నాడు కృత్తిక.

"ఆ సౌదామిని వివరాలేమైనా తెలిశాయా? అడిగాడు ప్రచండుడు ఆతృతగా.

"లేదు మంత్రివర్యా! ఆమెను వెంబడించడం మా ఎవరి వల్లా కావడంలేదు. ఆమె ఎక్కడి నుంచి వస్తుందో ఎవరికీ తెలియడం లేదు. అంబాపురం గ్రామంలో ఆమె పోరాడిన తీరు కూడా చాలా వింతగా ఉందని అక్కడ ప్రజలు చెప్పుకుంటున్నారు." ఆగాడు భరణి.

"వింతగా అంటే? వివరంగా చెప్పండి." కుతూహలంగా అడిగాడు రాజు.

"ఆరోజు అక్కడ చూసినవారు చెప్పినదాని ప్రకారం దుండగులు రెండు దిక్కులనున్న గాలిగోపురాల వేపు నుండి దాడి చేశారు. కానీ సౌదామిని ఒక్కర్తే వారిని రెండువైపుల నుండి ఎదుర్కొంది. రెండు దిక్కులనుండి ఆమె బాణాలను వేసిందని చూసినవారు చెబుతున్నారు. ఇది మానవ మాత్రులకు సాధ్యమైన విషయం కాదు ప్రభూ!" వివరించాడు అశ్విని.

"చూడబోతే ఈ దుండగులకన్నా ఈ సౌదామిని వలన కూడా మన రాజ్యానికి ఏదో ఒక ప్రమాదం వచ్చే సూచన కనిపిస్తోంది ప్రభూ! ఆమె విషయంలో నాకు ఏదో అనుమానంగా ఉంది. దేవతాంశగా జనాలలో నమ్మకాన్ని పుట్టించడానికి ప్రయత్నించడం వెనుక ఏదో స్వార్థం ఉంది అనిపిస్తోంది. లేకపోతే నిస్వార్థంగా ప్రాణాలను పణంపెట్టి సామాన్య జనులను కాపాడవలసిన అవసరం ఆమెకేంటి?" అనుమానం వ్యక్తం చేశాడు ప్రచండుడు.

"మంత్రీ! నువ్వు అనేది కూడా సబబే. కానీ ముందుగా ఈ దుండగులు మన రాజ్యంలో పుట్టిన విప్లవకారులా లేక శత్రురాజ్య సైనికులా లేక దోపిడీదారులా అనే విషయం తెలుసుకోవడం ముఖ్యం. ఈ సౌదామిని ఎవరైనాసరే ప్రస్తుతానికి ప్రజలను ఆపదలనుండి కాపాడుతోంది కనుక ఆమె విషయం తర్వాత ఆలోచిద్దాం." అన్నాడు ఆనందవర్ధనుడు దీర్ఘంగా ఆలోచిస్తూ.

"అదీ నిజమే ఆచార్యా! అయితే మరి ఆ దుండగులు ఎక్కడి నుంచి వచ్చారో కనిపెట్టగలిగారా!" అడిగాడు ప్రచండుడు వేగులను.

"పూర్తిగా తెలియలేదు ప్రభూ! అయితే వారు మన రాజ్యంలోవారు మాత్రం కాదు. వారిని ఎప్పుడూ ఎవరూ ఇంతకుముందు చూడలేదు. వారు మాట్లాడే యాస కూడా భిన్నంగా ఉందని గుడిలో విన్నవారు స్పష్టంగా చెప్పారు. వారు ఖచ్చితంగా వేరే రాజ్యం వాళ్లే అయి ఉండాలి. కానీ ఎక్కడివారు అన్నది ఇంకా మాకు స్పష్టత రాలేదు." అన్నాడు రోహిణి.

"అయితే ఈ దుండగులు ఒక్కోసారి ఒక్కొక్క రకంగా వేషాలు వేసుకుంటూ రాజ్యంలో శాంతిభద్రతలు లేకుండా చేయడానికి వివిధ ప్రాంతాలలో ఈ విధంగా అలజడులు సృష్టిస్తున్నారన్నమాట." అన్నాడు శూరసేనుడు నిట్టూరుస్తూ.

"వారెవరైనా, వారి కారణాలు ఏమైనా ప్రస్తుతం మనం వారిని అతి త్వరగా అరికట్టవలసి ఉంది. సౌదామిని ప్రజలకు మేలు చేస్తున్నా, దుండగులను అందరినీ హతమార్చడం వల్ల మనకు ఎవరూ ప్రాణాలతో పట్టుబడటం లేదు. ఈసారి ఎలాగైనా దుండగులలో ఎవరో ఒకరిని ప్రాణాలతో పట్టుకోవడం మనకి ముఖ్యం. అప్పుడు కానీ వారి గురించిన పూర్తి వివరాలు మనం తెలుసుకోలేము." అన్నాడు ఆనందవర్ధనుడు సూటిగా.

"మీరు దిగులుపడకండి మహారాజా! ఒక వారం రోజుల పాటు నేను, నా అంతరాంగిక అనుచరులను వెంట తీసుకుని స్వయంగా ఈ అవాంఛిత సంఘటనలు జరిగిన ప్రాంతాలలో పర్యటించి దుండగుల ఆచూకీ తెలుసుకుని వస్తాను. వారిలో దొరికిన వారిని ప్రాణాలతో పట్టి తెస్తాను. మాకు అనుమతి ఇవ్వండి." అన్నాడు ప్రచండుడు లేచి నిలబడి ఏదో నిర్ణయించుకున్నవాడిలా.

"మంత్రీ! ఎందుకైనా మంచిది. మీరు కూడా మారువేషాలలోనే వెళ్ళండి. కోటలో ప్రధానమైన యుద్ధ వీరులు, మంత్రి లేరన్న విషయం బయట తెలిస్తే ఇక్కడ ప్రమాదం పొంచిరావచ్చు. అలాగే ఆ సౌదామిని వివరాలు కూడా ఓ కంట కనిపెట్టండి" అన్నాడు ఆనందవర్ధనుడు వెంటనే.

"అలాగే ఆచార్యా! మేము వచ్చేవరకు మీరూ, సేనాధిపతీ మహారాజుగారికి తోడుగా ఉండండి. ఇక నాకు సెలవు ఇప్పించండి. రేపు తెల్లవారుజామునే నేను బయలుదేరుతాను." అన్నాడు మంత్రి అక్కడనుండి బయలుదేరబోతూ.

రాజు వెంటనే "శుభం మంత్రీ! వెళ్లి విజయంతో తిరిగి రండి." అని చెప్పి వేగులను ఉద్దేశించి "మీరు కూడా వెళ్లి రండి. మీతో కూడా కొందరు నమ్మకస్తులైన సైనికులను మారువేషాలలో తీసుకువెళ్లండి. వేషభాషలలో అనుమానాస్పదంగా కనిపించినవారిని ఎవరినైనా వెంటనే పట్టి బంధించి తీసుకురండి. సౌదామిని ఎక్కడ ఏ రూపంలో కనిపించినా ఆమెను కూడా వెంబడించండి. ఎప్పటికప్పుడు మీకు దగ్గరగా ఉండే కావలి దుర్గం నుండి పావురాలతో మాకు సమాచారం పంపండి. వచ్చేసారి మీరు నన్ను కలిసినప్పుడు అందరి గురించిన పూర్తి వివరాలు తీసుకురండి." అంటూ ఆజ్ఞాపించాడు.

వేగులు తలాడించి రాజుకు నమస్కరించి వెళ్ళిపోయారు.

సాయం సంధ్య కావస్తోంది. గుణ కొలిమి దగ్గర కూర్చుని గాజులు తయారు చేస్తున్నాడు. వెనుకనుండి అతని భుజాన్ని సుతారంగా ఒక చేయి తాకింది. కొలిమి వెలుగులో ఆ చేతికి ఉన్న ఉంగరం మరింత అందంగా మెరుస్తోంది.

తల తిప్పి చూడకుండానే గుణ "ఇవాళ ఎక్కడికీ వెళ్లలేదా?" అని అడిగాడు.

"ఏం గుణా? నాతో ఎందుకు ఈ మధ్యన ముభావంగా ఉంటున్నావు? నా మీద కోపం వచ్చిందా? నా వల్ల ఏదైనా పొరపాటు జరిగిందా?" సూటిగా అడిగింది మాలతి పక్కనే కూర్చుంటూనే.

గుణకు ఆమె నేరుగా అలా వచ్చి అడిగేసరికి ఏం చెప్పాలో తోచలేదు. అంబాపురం సంఘటన జరిగి వారం రోజులు దాటుతోంది. దూరంనుండి మాలతిని గమనిస్తున్నాడే తప్ప ఎక్కువగా ఆమెతో ఈ వారం రోజులుగా అతను మాట్లాడడం లేదు. ఆమె ప్రవర్తనలో ఏ విధమైన మార్పూ లేదు. ఆమె ఎప్పటివలె సాధారణంగా నడుచుకుంటోంది. ఆమె దినచర్యలో కూడా ఎటువంటి తేడా కనిపించలేదు గుణకు.

"ఏమీ లేదు మాలతీ! పని ఒత్తిడిలో పడి ఎక్కువగా నీతో మాట్లాడడానికి కుదరలేదు అంతే!" అని సమాధానం చెప్పాడు తప్పించుకునేందుకు ప్రయత్నిస్తూ.

"నాకెందుకో నువ్వు ముభావంగా ఉంటున్నావు అని అనిపించింది. అందుకే అడిగాను. సరేలే! సందరత్త ఏదీ?" అని అడిగింది మాలతి చుట్టూ చూస్తూ.

"అంగడి వరకు వెళ్ళింది కూరలు తెస్తానని. వద్దంటే వినదుగా! సరే పక్క వీధిలోనే కాబట్టి నాలుగడుగులు వేసినట్టు ఉంటుందని వెళ్ళమన్నాను." అన్నాడు గుణ.

"అవునా! రేపు నేను నాన్న వీరవరం వెళ్తున్నాము. మా పెద్దమ్మ కూతురు పెళ్లి. రెండు రోజుల్లో మళ్ళీ వచ్చేస్తాము. నీకు అత్తకు చెప్పి వెళ్దామని వచ్చాను. రేపు ఉదయాన్నే బయలుదేరుతున్నాము. వస్తాను. ఇంకా ఇంట్లో చాలా పని ఉంది." అని చెప్పేసి లేచి వెళ్ళిపోయింది మాలతి.

.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS